బోర్లా పడుకోమందా? అయితే ఆ అమ్మాయి వయసు నిశ్చయంగా పాతిక దాటి వుంటుంది అన్నాడు పద్మాకర్

నోర్ముయ్యి.

లేదు బాస్. వాత్స్యాయనుడి సుత్రాల ప్రకారం ఆ వయసు దాటాకే మొగళ్ళని బోర్లా .....

నీ సూత్రీకరణ అవతల పెట్టి ముందు నాకు కంగ్రాట్స్ చెప్పు. అసలు అంత అందమైన అమ్మాయి అంత ధైర్యంగా ఫోన్ చేయ్యటం ఐయామ్ లక్కీయార్.

మరి? ఎంతో తెలివి తేటలుంటే తప్ప చేసుకోను అందం కాదు ముఖ్యం అన్నావ్?

ఆ అమ్మాయికి తెలివితేటలు కూడ వుంటే వుంటాయ్.

ఉండే వుంటాయ్ ..... వెక్కిరించాడు. నువ్వు చెప్పినదంతా వింటూంటే ఆ అమ్మాయికి అంత ధైర్యంకానీ తెలివితేటలుకానీ వుంటాయని నేననుకోవటం లేదు.

కొంతమంది అంతే బాస్ ఎదురుపడితే ఏమీ మాట్లాడలేరు. అలా అని వాళ్ళకి రెండూ లేవనుకోకూడదు. రేప్రొద్దున్నే తేల్చేస్తాగా అన్నాడు విహారి.

*　　　　　　　　*　　　　　　　　*

మరుసటిరోజు కాలేజీ దగ్గర కాపు వేశాడు విహారి. దూరం నుంచి సునాదమాల వస్తూంది. దగ్గిరకొచ్చాక థాంక్యూ అన్నాడు చనువుగా.

ఆ అమ్మాయి చేతిలో పుస్తకాలు కూడా వణకటం స్పష్టంగా కనిపించింది.

ఎ ..... ఎ ..... ఎందుకు? అంది

ని ..... ని ..... నిన్న రాత్రి ఫోన్ చేసినందుకు.

నే ..... నే ..... నేను ఫోన్ చేశానా?

కా ..... కా ..... కాదా?

చూడండి మీరేదో విధంగా నాతో మాటలు కలిపి పరిచయం పెంచుకోవాలనుకుంటున్నారేమో నేనలాంటి దాన్ని కాను.

ఎలాంటివారు కారు మేడమ్ మీరు? అల్లరిగా అన్నాడు.

సునాదమాల వళ్లంతా చెమట్లు పడుతున్నాయ్. రక్షించే వాళ్ళు ఎవరూ లేరా అన్నట్టు చూసింది.

నేను గోపాలకృష్ణుడిలా కనిపించటం దురదృష్టకరం. ఇప్పటి వరకూ కేవలం మీ ఒక్కరిమీదే బోర్లా పడుకున్నాను నేను. అదీ యాదృచ్ఛికం.

మీకలా మాట్లాడడానికి సిగ్గులేదూ?

రాత్రి మీరు ఫోన్‌లో అడగ్గా లేనిది నేను ఇప్పుడు మాట్లాడితే వచ్చిందా?

దయచేసి నన్ను వదలి పెడతారా?

ఈ రాత్రికి మళ్ళీ ఫోన్ చేసి ఐలవ్యూ అంటానంటే వదుల్తాను.

అయితే వదలిపెట్టాను అని చెయ్యిపట్టుకున్నాడు. సునాదమాల కెవ్వున అరిచింది సైకిళ్ళ మీద వెళ్ళేవాళ్ళు కాలేజీకి వెళ్ళేవాళ్ళు అందరూ నిశ్చేష్టులయ్యేలా అరిచింది. అరుస్తూనే వుంది.

ఇంటికి రాగానే ఆ సాయంత్రం బామ్మ ఏమిటే చేతిని అలా తోముతున్నావు? అని అడిగినప్పుడు మాత్రం ఏం లేదు బామ్మా అని కొబ్బరిపీచు దాచేసింది.

*　　　　　　　　　　*　　　　　　　　　　*

ఆఖరిక్షణంలో టెర్రరిస్టులు దొరికి మంత్రివర్గ రాజీనామా చేయవలసిన అవసరం తప్పిపోవడంతో చిన్న అభినందన సభలాంటిది జరిగింది. ముఖ్యమంత్రి తన ఉపన్యాసంలో పోలీసులు, సి.బి.ఐ. డిపార్ట్‌మెంట్‌లని ముఖ్యంగా ప్రవల్లికని పొగిడారు. చిత్రమేమిటంటే ఆ సభకు ముఖ్యవక్త సూర్యారావు. విహారికి కూడా ఆహ్వానం వచ్చింది. వెనుక ఎక్కడో నిల్చున్నాడు.

సుర్యారావు ప్రారంభించాడు. మామూలు రాజకీయ ఉపన్యాసమే ఈరోజు ఎంతో సుదినం. మన గౌరవనీయులైన ముఖ్యమంత్రి పసిపిల్లల ప్రాణాల్ని రక్షించడానికి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయబూనారు. పైగా ఆ పదవిలో కొనసాగాలన్న బాధ్యత నా మీద పెట్టారు. ఇబ్బందికరమైన పరిస్థితి. అయినా రాష్ట్ర శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని దీనికి ఒప్పుకున్నాను. కానీ మన మనసు బాధపడుతూనే ఉంది. ఉగ్రవాదుల బెదిరింపులకు సౌజన్యమూర్తి పరిపాలనాదక్షుడు అయిన ముఖ్యమంత్రి పదవి కోల్పోవడం ఆ పదవిని నేను చేపట్టవలసి రావడం నన్ను నిరంతరం క్షోభకు గురిచేసింది. ఈ పరిస్థితి నుంచి బయటవెయ్యమని దేముడిని నేను ప్రార్థించని క్షణం లేదు. భగవంతుడే నా ప్రార్థన ఆలకించినట్టున్నాడు. ఈ విషయంలో సి.బి.ఐని ముఖ్యంగా డిప్యూటి చీఫ్ ప్రవల్లికని అభినందిస్తున్నాను అన్నాడు సుర్యారావు.

విహారి జనాన్ని తోసుకుని కాస్త ముందుకు వచ్చాడు. అతడి మొహం ఎర్రగా కందిపోయివుంది. సుర్యారావు కొనసాగించాడు.

ఈ ..... రోజు మన రాష్ట్రం ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటూంది. ఈ పరిస్థితులలో మనకి సుస్థిరత్వం కావాలంటే మన నాయకుడి పట్ల మనందరం విశ్వాసం ప్రకటించాలి.

“అబద్ధం ..... ”

ఒక మూలనుంచి వినిపించిన అరుపుకి అందరి కళ్ళు అటు తిరిగాయి.

విహారి ఆవేశంతో వణికిపోతున్నాడు

మరీ ఇంత మోసమూ అన్నట్టుంది అతడి ముఖ భంగిమ. దీన్ని సహించనట్టు అతడి పిడికిళ్ళు బిగుసుకుని వున్నాయి. ఈ సూర్యారావు చెబుతున్నదంతా అబద్ధం.

దగ్గరగా వున్న పోలీసులు పరుగెత్తుకు వచ్చి అతడిని బలవంతంగా బయటకు లాక్కెళ్ళడానికి ప్రయత్నించారు. అతడు ఒక విదిలింపుతో వాళ్ళని వదిలించుకుని స్టేజి దగ్గరకి వచ్చాడు. ముఖ్యమంత్రిని కూడ పట్టించుకోకుండా అతడు మైకు దగ్గరకు వెళ్ళబోయాడు.

నిలబడి ప్రవల్లిక గారితో పాటు టెర్రరిస్టులు తీసుకెళ్ళింది నన్నే నా పేరు విహారి అన్నాడు.

చప్పున ఆ సభలో నిశ్శబ్దం ఆవరించింది.

చాలా మంది అతడిని అంతకుముందు చూడలేదు. కానీ పేరు అందరికీ పరిచయమే. అతడు తానెవరో చెప్పేసరికి తాత్కాలికమైన ఉద్వేగం సభంతా అలుముకుంది. ఆ నిశ్శబ్దంలోంచి అతడు చెప్పడం ప్రారంభించాడు. అతడు చెప్పటాన్ని ఆపుచేయటానికి ప్రయత్నిస్తున్న సూర్యారావుని ముఖ్యమంత్రి చేతి సైగతో ఆపు చేశాడు. అంతా వివరంగా చెప్పి దీని వెనుకంతా వున్నది సుర్యారావు అని పూర్తి చేశాడు.

నువ్వెవరి మీద అభియోగం చేస్తున్నావో తెలుసా? ముఖ్యమంత్రి అడిగాడు.

తెలుసు పదవి నుంచి మిమ్మల్ని కూలదోసి, ముఖ్యమంత్రి అవుతామనుకున్న ఈ సూర్యారావు మీదా, అద్భుతమైన ప్లాన్‌వేసి అతడికి సాయపడిన అనంతానంతస్వామి మీదా .....

సభలో చీమ చిటుక్కుమంటే వినబడేంత నిశ్శబ్దం.

మమ్మల్ని ఎలాగైనా చంపేస్తామన్న ధీమాతో ఆ టెర్రరిస్టులు మా దగ్గర చెప్పినదాన్ని బట్టి అనంతానంతస్వామికి ఈ సూర్యారావు సహచరుడు.

దీనికెవరు సాక్షులు?

అడవిలో సాక్ష్యాలేముంటాయి? నేనూ ప్రవల్లికే.

ముఖ్యమంత్రి ఆమెవైపు తిరిగి ఏమ్మా నిజమేనా? అని అడిగారు ఆమె వైపే చూశాంరందరూ. ఆమె ఆగి నెమ్మదిగా అంది కాదు.

కాదా ..... విహారికి షాక్ తగిలినట్టయింది. నో ఆమె అబద్ధం చెపుతోంది అని పిచ్చిగా అరిచాడు.

అతడి మాటలు పట్టించుకోకుండా ప్రవల్లిక అన్నది మమ్మల్ని కారులో ఎక్కించుకుని అడవిలోకి తీసుకెళ్ళారు అదృష్టవశాత్తు ఆఖరి క్షణంలో తప్పించుకున్నాము వాళ్ళు ఒక్కమాట కూడ మట్లాడలేదు.

సభలో కలకలం రేగింది. విహారి ఏదో చెప్పబోతుంటే పోలీసులు వచ్చి చెరో రెక్క పట్టుకున్నారు.

బలవంతంగా స్టేజి దింపారు. విహారి గింజుకుంటూ వుండగా కెమెరాలు క్లిక్ మన్నాయి.

సూర్యారావు తిరిగి మైకు తీసుకున్నాడు నాకూ ముఖ్యమంత్రికీ మధ్య మనస్పర్థలు తీసుకు రావడానికి ఏ ప్రతిపక్షం వాళ్ళో నియమించిన మనిషి అయివుంటాడు. అతడిని అరెస్టు చేసి విషయం రాబట్టండి.

వద్దు అన్నాడు ముఖ్యమంత్రి ఎంతోమంది చిన్నపిల్లల్ని రక్షించిన దృష్ట్యా అతడిని క్షమించి వదిలేద్దాం.

పోలీసులు బయటకు లాక్కెళ్తూ వుండగా అతడు అరిచాడు. చీఫ్‌మినిష్టర్ పడగ నీడలో

విహారిని బయట వరకు తీసుకొచ్చి వదిలేశాడు సెక్యూరిటీ గార్డులు.

చీకటి పడుతోంది.

అతడికి పిచ్చి పట్టినట్టు వుంది. కసిగా వుంది. కోపంగా వుంది. కాళ్ళతో రాళ్ళను తన్నుకుంటూ కారు దగ్గరకి వచ్చాడు.

ఇంటికి వెళ్ళలేదు. తాము నాటకాలు ఆడే రిహార్సల్స్ రూమ్‌కి వెళ్ళాడు

లోపల మరో కొత్త నాటకం రిహార్సల్స్ జరుగుతూంది. అతడికి లోపలికి వెళ్ళబుద్ది కాలేదు. అతడికి దేనిమీదా మనస్సు నిలబడడం లేదు. అన్నింటి మీదా విరక్తి కలుగుతోంది. పోలీసులు తనని రెక్కలు పట్టుకుని బయటకు లాక్కెళ్ళే దృశ్యం కళ్ళముందు కదలాడుతూంది. దానికన్నా ప్రవల్లిక తన స్థానంలో కదలకుండా కూర్చుని దీన్నంతా తనకేమీ పట్టనట్టు చూస్తూ వుండిపోవడం అతడి గుండెల్లో కత్తిపెట్టి తిప్పినట్టు అవుతోంది. ఆమె యింత కూల్‌గా అబద్దం చెపుతుందనుకోలేదు. అనవసరంగా ఈ రొంపిలో ఇరుక్కున్నానన్న భావం కలిగింది.

అతడు కారుని  ఒక సినిమా హాలు ముందు ఆపి టిక్కెట్టు కొనుక్కుని లోపలికి వెళ్ళాడు. అప్పటికే సినిమా సగం అయింది. కుర్చీ వెనక్కువాలి కుర్చున్నాడు. కళ్ళు మూసుకుంటే ప్రవల్లిక భంగిమ గుర్తొచ్చి ఆమె మీద కోపం ఎక్కువ అవుతోంది. కొంచెం సేపు అయ్యాక కలకలం వినిపిస్తే కళ్ళు తెరిచాడు. సినిమా అయిపోయింది వందమంది కన్నా ఎక్కువలేరు ప్రేక్షకులు బయటకు వస్తూ పక్కనున్న పెద్ద మనిషిని ఏం సినిమా యిది అని అడిగాడు. ఓ పిచ్చివాణ్ని చూసినట్టు చూసి దమయంతీ హరిశ్చంద్ర సంవాదం అన్నాడా పెద్ద మనిషి.

కారు దగ్గిరకొచ్చి ఎక్కబోతుంటే క్రింది క్లాసునుంచి అప్పుడే బయటకు వస్తున్న సునాదమాల, బామ్మ కనపడ్డారు. అతడి బాధంతా చేత్తో తీసేసినట్టు అనిపించింది. దగ్గరగా వెళ్ళి హల్లో అన్నాడు.

హల్లో అంది బామ్మ.

రండి డ్రాప్ చేస్తాను సునాదమాలవేపు చూస్తూ అడిగాడు ఆ అమ్మాయి అప్రయత్నంగా అడుగు వేయడం స్పష్టంగా కనిపించింది.

ఎక్కడుంది నాయనా కారు బామ్మ అడిగింది. మాల ఆమె వైపు కోపంగా చూడడం ఆ మసక వెలుతుర్లో స్పష్టంగా కనిపించింది ముగ్గురూ కారుదగ్గరికి వచ్చారు బామ్మ ముందు సీట్లో కూర్చుంది.

ఎలా వుంది సినిమా సంభాషణ  కలుపుతూ అడిగాడు.

పక్క హాలుకొచ్చాం నాయనా టిక్కెట్టు దొరక్కపోతే అమ్మాయి దీనికి వెళదామని బలవంతం చేసింది అంది పక్క థియేటర్‌లో మన్మథలీల రామరాజుగోల ఆడుతోంది పక్కన కూర్చున్న బామ్మవేపు వాలుగా చూశాడు విహారి . కొంపదీసి ఈవిడ కాదు కదా తనకి ఫోన్ చేస్తూంది.

అతడు తన ఆలోచనకి తనలో నవ్వుకుంటూ థియేటర్ నుంచి కారు బయటకు తీసుకొచ్చాడు. అతడి వెనకే మరో కారు ఫాలో అవడం అతడు గమనించలేదు.

మీ విష్ణు బావున్నాడా?

బావున్నాడు బాబు రోజూ ఒకసారన్నా నిన్ను తలుచుకుంటాడు. మీ అమ్మగారు బావున్నారా? మొన్న గుళ్ళో హరికథకొచ్చారు.

అతడు ఆ ముసలావిడవైపు చిత్రంగా చూశాడు. ఒకవైపు గుడి అంటుంది మరోవైపు మదనకామరాజు అంటుంది.

మీ మనవరాలికి బాగా సిగ్గు అనుకుంటాను.

పైకిలా వుంటుంది. ఇంట్లో తెగ అల్లరి చేస్తుంది. అంటూ కెవ్వున అరిచింది బామ్మ సడన్ బ్రేక్ వేసినంత పని చేసాడు విహారి. చూశావా బాబూ క్రిందనుంచి ఎలా గిల్లిందో అంది కాలు రుద్దుకుంటూ.

విహారి అద్దంలో వెనుక కూర్చున్న సునాదమాలని చూశాడు. ఆమె తలవంచుకుని వుండడంతో కనపడడం లేదు. పైకి నెమ్మదిగా కనపడుతూ కొంతమంది ఆడపిల్లలు తెగ అల్లరి చేస్తారని అతనికి తెలుసు. కానీ మరీ మొగాడు కనపడితే అంతలా వణికిపోతూ ఫోన్‌లో విజృంభించే ఆడపిల్లని చూడడం యిదే ప్రథమం.

అకస్మాత్తుగా అతడికో విషయం స్ఫురించింది.

..... జీన్స్ .....

బామ్మ మనవరాలు సునాదమాల

హరికథలు దేముడు పూజ అన్నీ నిర్వ ర్తిస్తూనే ఎంతో జోవియల్‌గా, అప్పుడప్పుడు ఇంగ్లీషులో మాట్లడే బామ్మ రక్తమే సునాదమాలలో కూడా ప్రవహిస్తోంది. ఆ అమ్మాయి మరింత అల్లరి పిల్ల అయి వుండవచ్చు. పైకి ఎంతో నెమ్మదిగా కనపడుతూ ఇంత చిన్న విషయం తెలుసుకోవడానికి తనకి ఇంత సేపు పట్టింది.